సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



బిల్లు సరిచేయమంటే..

విద్యుత్ శాఖ సిబ్బంది నిరక్ష్యాన్ని నిరసిస్తూ బాధితుడు ఆ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగాడు.

10లో▸

న్యూస్‌రీల్

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)లో 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని కమ్మదనం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా జనవరి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు రూ.200 పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభా కళాశాలలో ఐఐటీ, జేఈఈ, నీట్, సీఎంఏ, క్లాట్ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 1800 425 45678 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెట్రోల్‌ను విడిగా విక్రయించొద్దు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పెట్రోల్‌ను బాటిళ్లలో విక్రయించడం నిబంధనలకు వ్యతిరేకం అని, ప్రమాదానికి హేతువని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ఇమామ్ గూడలోని పెట్రోల్ బంక్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెట్రోల్ బంక్‌ల అనుమతులను కాల పరిమితి ముగిసేలోపే పునరుద్ధరణకు చర్యలు తీసుకోవటం మేలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విడిగా అమ్మడం చేయరాదన్నారు. అనంతరం తూనికలు కొలతల శాఖ, కేంద్ర ప్రభుత్వ అనుమతి పత్రాలను పరిశీలించారు.

లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: వాహనదారులు లోక్ అదాలత్‌లను ఉపయోగించుకొని పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీస్ కేసులను పరిష్కరించుకోవాలని రిటైర్డు జడ్జి సాంబశివరావు సూచించారు. మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులకోసం నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్ గురువారం నాలుగో రోజు కొనసాగింది. ఇందులో 105 మద్యం తాగి వాహనాలు నడిపించిన కేసులు పరిష్కారమైనట్టు సాంబశివరావు తెలిపారు. ఈ కేసులకు సంబంధించి రూ.1,34,500 జరిమానాలు విధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

'సే నో టు డ్రగ్స్' ప్రారంభం



బండ్లగూడ: మాదకద్రవ్యాలపై జంగ్ షురూ చేసిన నగర పోలీసు విభాగం అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. ఓవక్క డ్రగ్స్ తయారీ, సరఫరా, విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపుతూనే యువతలో అవగాహన పెంచడానికీ పెద్ద పీట వేస్తున్నారు. దీనికోసం ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగానే నగర శివార్లలోని షాదాన్ కళాశాలలో జరుగుతున్న పల్సేషన్–2023 కార్యక్రమానికి గురువారం హాజరైన నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస రెడ్డి 'సే నో టు డ్రగ్స్' క్యాంపెయినింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల నుంచి అప్పా జంక్షన్ వరకు జరిగిన 2కే రన్‌లో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు. ఇందులో వివిధ కళాశాలలకు చెందిన 2 వేల మంది మెడిసిన్ విద్యార్థులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. పల్సేషన్–2023లో భాగంగా అంతర్ కళాశాలల కల్చరల్, లిటరరీ, స్పోర్ట్స్, ఫుడ్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి.

నిమ్స్‌లో వెయ్యి మార్క్ దాటిన వ్యాస్కులర్ సర్జరీలు

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) చరిత్రలో మొదటిసారిగా వ్యాస్కులర్ సర్జరీ విభాగం శస్త్రచికిత్సల్లో వెయ్యి మార్క్ దాటి తన ఉనికిని చాటుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి గురువారం వరకు ఫిస్టులా ఆర్టెరియోవెనస్ సర్జరీలు జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వ్యాస్కులర్ సర్జరీ హెచ్ఓడీ డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో సెలబ్రేట్ చేసుకున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప కేక్ కట్ చేశారు. ఈ సర్జరీలో పాల్గొన్నటువంటి వైద్యులను, హెల్త్ కేర్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

అర్జీల వెల్లువ

అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ

- అట్టహాసంగా ప్రారంభమైన కార్యక్రమం
- పల్లెలు, వార్డుల్లో పకడ్బందీగా సభలు
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- నిర్వహణ తీరును పర్యవేక్షించిన ఉన్నతాధికారులు
- తొలి రోజు అందిన దరఖాస్తులు 49,110



దరఖాస్తుదారులతో కిక్కిరిసిన కేంద్రం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమం గురువారం జిల్లాలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. అనంతరం పంచాయతీ రాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కలెక్టర్ గౌతం పొట్రుతో కలిసి పరిశీలించారు. జనవరి 6 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమం కోసం పంచాయతీలు, వార్డుల వారీగా షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజైన గురువారం 558 పంచాయతీలు, 16 మున్సిపాలిటీల పరిధిలోని మున్సిపల్ వార్డుల్లో సభలు కొనసాగాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేసింది. మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 49,110 అర్జీలు అందాయి.

పల్లెలు, వార్డుల్లో సందడి

రద్దీ, తోపులాటలకు ఆస్కారం లేకుండా మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుండి అధికార బృందాలు దరఖాస్తులు స్వీకరించాయి. స్వీకరించిన ప్రతి దరఖాస్తు వివరాలను ప్రత్యేకంగా రిజిస్టర్లో నమోదు చేస్తూ, దరఖాస్తుదారులకు రసీదులు అందించారు. దరఖాస్తుల వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు వీలుగా టీం లీడర్లు వాటిని భద్రపర్చారు. ఉదయం 8 గంటలకే ప్రజాపాలన సభలతో పల్లెలు, వార్డుల్లో సందడి మొదలైంది.



రసీదు అందిస్తున్న సందీప్ కుమార్ సుల్తానియా, చిత్రంలో కలెక్టర్ గౌతం పొట్రు

ఉదయం నుంచి మధ్యాహ్నం 12 వరకు, భోజన విరామం అనంతరం తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్లలో సభలు నిర్వహించారు. ముందుగానే దరఖాస్తులు అందుబాటులో ఉంచుతూ, వాటిని ఎలా పూరించాలనే దానిపై అధికారులు సూచనలు చేస్తూ అంగన్‌వాడీలు, విద్యావంతులైన యువకులు, వలంటీర్ల ద్వారా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించారు. సభలు ప్రారంభమైన వెంటనే అధికారులు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తులు స్వీకరించడం సత్ఫలితాలనిచ్చింది.

రేషన్‌కార్డుతో సంబంధం లేదు

ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. ప్రభుత్వం అంత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని.. అభయ హస్తం ఆరు గ్యారంటీల కోసం ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించాలని సూచించారు. కలెక్టర్ గౌతం పొట్రు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించి, రసీదు పొందాలని పేర్కొన్నారు. రేషన్ కార్డు ఉంటేనే దరఖాస్తు చేయాలి అనే నిబంధన లేదని.. ఆధార్ కార్డ్ జిరాక్స్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని.. వదంతులు నమ్మి ఆందోళనకు గురి కావద్దన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ రసీదు, దరఖాస్తు నంబర్ భద్రపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ శృతి ఓజా, సంబంధిత అధికారులు ఆయా సెంటర్లలో దరఖాస్తుల స్వీకరణ తీరును పర్యవేక్షించారు.



కొంగరకలాన్‌లోని పీఎస్ఆర్ శ్లోకా కన్వెన్షన్ హాల్‌లో గురువారం జరిగిన బీజేపీ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం తదితరులు అమిత్‌షాను సన్మానించారు.





వేటు పడింది..

ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సస్పెన్షన్



ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్

శంషాబాద్: ఇద్దరు మహిళల మధ్యన జరిగిన రియల్ ఎస్టేట్ ఆర్థిక వ్యవహారాలో సమగ్ర విచారణ చేపట్టకుండా నిందితురాలితో పాటు వారి కుటుంబాన్ని రిమాండ్ చేసిన విషయంలో ఆర్‌జీఐఏ ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో మైహోం అంబుజా ఎస్టేట్‌లో నివాసం ఉండే మండల శారద అదే కమ్యూనిటీలో ఉండే నారగాని ఆంజనేయ ప్రసాద్ భార్య (55)కు ప్లాట్ల కొనుగోలు విషయంలో రూ. 6 కోట్లు ఇచ్చినప్పటికీ ప్లాట్లు చూపించకుండా మోసం చేసిందని ఫిర్యాదు చేసింది. ఈ ఆర్థిక లావాదేవీ శంషాబాద్ విమానాశ్రయంలో జరిగినట్లు పేర్కొంది. ఈ ఆర్థిక లావాదేవీల్లో ఎలాంటి ప్రమేయం లేని నిందితురాలి భర్త, కుమార్తె, కుమారుడిపైనా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిందితురాలి కుమార్తె నారగాని యశస్వి అక్టోబర్ 19వ తేదీన అప్పటి డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్‌జీఐఏ పీఎస్ పరిధిలో ఆర్థిక లావాదేవీ జరగనప్పటికీ ఉద్దేశపూర్వకంగా స్థానికంగా కేసు నమోదు చేయడంతో పాటు తమ కుటుంబాన్ని తీవ్ర మనోవేదనకు గురయ్యేలా ఇన్‌స్పెక్టర్ రాపోలు శ్రీనివాస్ వ్యవహరించారని పేర్కొన్నారు. కోర్టు పరిధిలోని సివిల్ కేసును ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉద్దేశపూర్వకంగా డబ్బుల కోసం తమ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులు పెట్టారని.. ఆయనపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా.. పోలీస్ శాఖ అంతర్గత విచారణ చేపట్టింది. ఈ క్రమంలో సమగ్ర విచారణ చేపట్టకుండా తన అధికారాన్ని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ దుర్వినియోగం చేసినట్లు గుర్తించి ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తదితరులు

కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆ నాడు అనేక మంది కాంగ్రెస్ నేతల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. వారి పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. భారత జాతీయ కాంగ్రెస్ 139వ ఆవిష్కరణ వేడుకలు గురువారం గాంధీభవన్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగాల పునాదులపై ఏర్పడిన ప్రజాస్వామ్య దేశంలో 150 మంది ఎంపీలను పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. పేదలకు భూ పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు సమర్థవంతంగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పని చేస్తున్న ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని, వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, మాజీ మంత్రి పుష్పలీల, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు భీంభరత్, పీసీసీ సభ్యులు రాంరెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శులు జ్ఞానేశ్వర్, వేణుగౌడ్, డీసీసీ మాజీ కార్యదర్శి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మజ్ఞానం తెలుసుకున్నవారే ధ్యానులు

పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి



ప్రసంగిస్తున్న పరిమళపత్రి



హాజరైన ధ్యానులు

కడ్తాల్: ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకున్నవారే ధ్యానులని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ గ్లోబల్‌ఫౌండర్ పరిమళపత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ క్షేత్రంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం గురువారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ధ్యానులను ఉద్దేశించి పరిమళ పత్రి సందేశమిచ్చారు. భూమి మీద విశ్వనియమాలు సకల ప్రాణకోటికి ఒక్కటేనని తెలిపారు. మహేశ్వర మహాపిరమిడ్ శక్తిస్థల్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఆధ్యాత్మికతతో సరైన మిత్రుత్వం లభిస్తుందన్నారు. ధ్యానం ఎంతో విశిష్టమైనదని, నిత్యం ధ్యాన సాధన చేయాలని సూచించారు. శరీరం, మనస్సు, బుద్ధి, శ్వాస ఏకం కావడమే ధ్యానమన్నారు. ధ్యానం చేయడం ద్వారా శరీరం, మనస్సు, బుద్ధి, ఆత్మ అన్ని బాగుపడుతాయని తెలిపారు. పీఎస్ఎస్ఎం భాగ్యనగర్ ట్రస్టీ లక్ష్మి మాట్లాడుతూ.. పత్రీజీ ఎన్నో అద్భుతాలు సృష్టించారని, అందులో ఒక అద్భుతం పిరమిడ్ పార్టీ అని తెలిపారు. పిరమిడ్ కేంద్రం ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతోందన్నారు. ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పత్రీజీ శక్తిస్థల్ ప్రాజెక్టుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. పరిణిత పత్రి మాట్లాడుతూ.. శాఖాహార జగత్తుకు కృషి చేయాలని కోరారు. వేడుకల్లో నండూరి శ్రీనివాస్ ప్రవచనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పిరమిడ్ సందర్శనకు వేలాదిగా వచ్చిన ధ్యానులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ దాట్ల హన్మంతరాజు, కిషన్‌రెడ్డి, శివప్రసాద్, రాయజగపతిరాజు, బాలకృష్ణ, నవకాంత్, ఆనంద్, విజయలక్ష్మి, వాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్ @డ్రగ్స్!

తల్లి సపర్యల కోసం మాదకద్రవ్యాలకు బానిసయ్యాడు



- బతుకు భారం కావడంతో అదే దందాలోకి
- లాథూర్‌కు చెందిన అనూప్ వ్యవహారమిది
- ఇద్దరు అనుచరులతో కలిసి క్రయవిక్రయాలు
- న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో సరుకుతో సిటీకి
- ముగ్గురు పెడ్లర్స్‌ను అరెస్టు చేసిన టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: పగలంతా ఆఫీస్‌లో పని.. రాత్రి ఆస్పత్రిలో ఉన్న తల్లికి సపర్యలు... ఈ రెండింటినీ అలుపు లేకుండా పూర్తి చేయాలంటే డ్రగ్స్ వాడాలంటూ ఓ స్నేహితుడు ఇచ్చిన సలహా ఓ ఇంజినీర్‌ను మాదకద్రవ్యాల విక్రేతగా మార్చింది. పుణేతో పాటు హైదరాబాద్‌లోనూ ఇద్దరు అనుచరులతో కలిసి దందా ప్రారంభించాడు. న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో నగరంలో డ్రగ్స్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో తన ఇద్దరు అనుచరులతో కలిసి ఎండీఎంఏ తీసుకువచ్చాడు. ఈ ముగ్గురు నిందితులనూ సౌత్ ఈస్ట్‌జోన్ పోలీసులు సెక్రటేరియేట్ ఠాణా అధికారులతో కలిసి పట్టుకున్నట్లు గురువారం మధ్య మండల డీసీపీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు.

నెలకు రూ.లక్ష వేతనం..

మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన అనూప్ నవనాథ్ సోనావాలే మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాడు. పుణేలో నెలకు రూ.లక్ష జీతానికి ఓ కార్యాలయంలో కొన్నాళ్లు విధులు నిర్వర్తించాడు. తన జీతం నుంచి ప్రతి నెలా కొంత మొత్తం పొదుపు చేసిన నగదుతో డౌన్ పేమెంట్‌గా చెల్లించి, భారీ మొత్తం ఫైనాన్స్ చేసి నాలుగు ట్రక్కులు ఖరీదు చేశాడు. వీటిని కిరాయికి తిప్పుతూ అదనపు ఆదాయం ఆర్జించాడు. తన తల్లికి తీవ్ర అనారోగ్యం కావడంతో సుదీర్ఘకాలం ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స చేయించాడు. ఆ సమయంలో పగలు ఉద్యోగం, ట్రాన్స్‌పోర్ట్ వ్యవహారాలు చక్కబెట్టడంతో పాటు రాత్రి వేళల్లో చికిత్స పొందుతున్న తల్లికి సపర్యలు చేయాల్సి వచ్చింది. దీంతో తీవ్రంగా అలసిపోతున్న అతడికి ఓ స్నేహితుడు డ్రగ్స్‌పై తప్పుడు సలహా ఇచ్చాడు. ఎండీఎంఏను ప్రతి రోజూ నిర్ణీత మోతాదులో తీసుకుంటే అలసట లేకుండా పగలు–రాత్రి పని చేయగలవని తప్పుదోవ పట్టించాడు. ఇది నిజమని నమ్మిన అనూప్ ముంబైలోని నల్సోప్రా ప్రాంతంలో నివసిస్తున్న ఆఫ్రికన్ జాతీయుడు జ్యో అలియాస్ జాక్‌ను సంప్రదించాడు.

లాక్‌డౌన్ ఎఫెక్ట్‌తో నిండా మునిగి..

తనకు అవసరమైనప్పుడు జ్యో నుంచి ఎండీఎంఏ ఖరీదు చేసి వినియోగించేవాడు. కరోనాతో అమలైన లాక్‌డౌన్ ఇతడి జీవితాన్ని మార్చేసింది. ఈ ఎఫెక్ట్‌తో ఉద్యోగం కోల్పోవడంతో పాటు ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం ఆగిపోయి, నెలవారీ కిస్తీలు పెరిగిపోయి, చేతిలో చిల్లిగవ్వ లేకుండాపోయింది. నాలుగు ట్రక్కులను ఫైనాన్స్ కంపెనీ సీజ్ చేసింది. దీంతో ఆదాయం కోసం తానే డ్రగ్ పెడ్లర్‌గా మారాలని నిర్ణయించుకున్నాడు. జ్యో నుంచే ఎండీఎంఏ ఖరీదు చేస్తూ నాందేడ్, పుణేలకు చెందిన కిరణ్ గంగాధర్ భోంస్లే, వివేక్ రాజేష్ వాఘ్మేర్‌లకు విక్రయించడం మొదలెట్టాడు. గ్రాము రూ.2 వేలకు ఖరీదు చేసి, వీరికి గ్రాము రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్మేవాడు. ఈ ద్వయానికి పుణేతో పాటు హైదరాబాద్‌లోనూ కొందరు వినియోగదారులు ఉన్నారు. వారికి తరచుగా ఎండీఎంఏ సరఫరా చేస్తూ గ్రాము రూ.8 వేల నుంచి రూ.10 వేలకు అమ్ముతున్నారు. అనూప్ గతేదాది హెచ్–న్యూ పోలీసులకు చిక్కగా... మిగిలిన ఇద్దరిపై పుణేలో డ్రగ్స్ సహా వివిధ కేసులు ఉన్నాయి.



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను చూపిస్తున్న పోలీసులు

న్యూ ఇయర్ పార్టీల కోసం భారీగా...

నగరంలో వివేక్, కిరణ్‌లకు ఉన్న రెగ్యులర్ కస్టమర్స్‌లో రియాజ్, ఆరిఫ్ కూడా ఉన్నారు. న్యూ ఇయర్ పార్టీల కోసం వీరి నుంచి 150 గ్రాములు ఎండీఎంఏ సరఫరా కోసం ఆర్డర్ వెళ్లింది. ఈసారి సరుకు డెలివరీ కోసం వీళ్లు అనూప్‌ను కూడా తీసుకుని వచ్చారు. 102 గ్రాములు ఎండీఎంఏతో రెండు రోజుల క్రితం సిటీకి వచ్చిన ఈ త్రయం ఎంఎస్ మక్తాలోని ఓ స్నేహితుడి ఇంట్లో బస చేశారు. గురువారం ఉదయం ఈ సరుకు రియాజ్, ఆరిఫ్‌లకు సరఫరా చేయడానికి బయలుదేరారు. దీనిపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. డీసీపీ ఏవీఆర్ నర్సింహ్మారావు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదాబాబు, ఎస్సైలు ఎం.అనంతాచారి, పి.సాయిరామ్ వలపన్ని ముగ్గురినీ పట్టుకున్నారు. వీరి నుంచి డ్రగ్ స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం సెక్రటేరియేట్ పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న జ్యో, రియాజ్, ఆరిఫ్‌ల కోసం గాలిస్తున్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టండి

టీఎస్ యూటీఎఫ్

జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాబాద్: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటప్ప కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సభ్యత్వ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనంన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగాన్ని కొత్త ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా సాధారణ బదిలీలు సైతం లేవన్నారు. ఇటీవల జరిగినా అవి అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం వెంటనే బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేసి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, మండల అధ్యక్షుడు బాలకృష్ణ, కార్యదర్శి ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ తదితరులున్నారు.

గొర్రెల పంపిణీ పథకంలో గోల్‌మాల్

- రూ.2.10 కోట్లు దారిమళ్లింపు
- ముగ్గురిపై కేసు నమోదు

గచ్చిబౌలి: కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కై గొర్రెల పంపిణీ పథకంలో గోల్‌మాల్ చేసి రూ.2.10 కోట్లు దారి మళ్లించిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. ముగ్గురు నిందితులపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. డీఐ రాఘవేందర్ కథనం ప్రకారం.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా రాష్ట్ర పశు సంవర్ధక శాఖ వేర్వేరు రాష్ట్రాల నుంచి గొర్రె పిల్లలను కొనుగోలు చేసి వాటిని తెలంగాణ రైతులకు ఉచితంగా పంపిణీ చేసేది. ఇందులో భాగంగా కొండాపూర్ కేంద్రంగా 'లోలోనా దిలైవ్‌స్టాక్ కంపెనీ' నిర్వహిస్తున్న సయ్యద్ మోయిద్ అనే కాంట్రాక్టర్‌తో కలిసి పశుసంవర్ధక శాఖతో అసిస్టెంట్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న రవికుమార్, కేశవసాయి గత ఆగస్టు 13 నుంచి 23 వరకు ఏపీలోని పలు జిల్లాల్లో పర్యటించి రైతుల వద్ద ఉన్న గొర్రె పిల్లలను పరిశీలించారు. 20 గొర్రెలు, ఒక పొట్టేలు కలిపి ఒక యూనిట్‌గా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇలా మొత్తం 18 మంది రైతుల నుంచి 133 యూనిట్ల గొర్రె పిల్లలను కొనుగోలు చేశారు. అనంతరం అధికారులు రైతులకు సంబంధించిన ఆధార్, పాన్‌కార్డుతోపాటు బ్యాంక్ అకౌంట్ నెంబర్లను సేకరించి ఆయా వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి నేరుగా రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు ఈ బాధ్యతను కాంట్రాక్టర్ మోయిద్‌కు అప్పగించారు. దీంతో అతను రైతుల స్థానంలో తమ బినామీలకు చెందిన బ్యాంక్ ఖాతాల నెంబర్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అనంతరం పశుసంవర్ధక శాఖ నుంచి విడుదలైన డబ్బులు నేరుగా బినామీ ఖాతాల్లో పడ్డాయి. ఇలా మొత్తం రూ.2,10,14000 అధికారులు, కాంట్రాక్టర్ స్వాహా చేశారు. గొర్రె పిల్లలు తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా తమ అకౌంట్‌లో డబ్బులు పడకపోవడంతో అనుమానం వచ్చిన రైతులు ఇటీవల కొండాపూర్‌లోని మోయిద్ కార్యాలయానికి వచ్చి అతడిని నిలదీశారు. ప్రభుత్వం ఇంకా డబ్బులు విడుదల చేయలేదని చెప్పాడు. దీంతో రైతులు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా తమకు రావాల్సిన డబ్బులు ఇతర ఖాతాల్లోకి మళ్లించినట్లు తెలిసింది. దీంతో ఈనెల 26న గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కాంట్రాక్టర్‌తో పాటు అధికారులు రవికుమార్, కేశవ్‌సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ బిల్లు సరిచేయమంటే..

కనెక్షన్ కట్ చేశారు

- డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించిన బాధితుడు

తుర్కయంజాల్: విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వచ్చిన అధిక బిల్లును తగ్గించమని దరఖాస్తు చేసుకున్నందుకు కనెక్షన్ కట్ చేశారు. దీంతో ఆగ్రహించిన బాధితుడు డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపాడు. ఈ ఘటన తుర్కయంజాల్‌లో గురువారం చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని పద్మావతి కాలనీలో అద్దెకు ఉంటున్న క్రాంతికిరణ్ ఇంటికి నవంబర్‌లో రూ.8500 బిల్లు ఇచ్చారు. దీంతో నేను వినియోగించిన దానికన్నా ఎక్కువగా వచ్చిందని.. బిల్లును సవరించాలని విద్యుత్ శాఖ సిబ్బందిని కోరాడు. వారు స్పందించ లేదు. తిరిగి డిసెంబర్‌లో మరో రూ.వేయితో కలిపి రూ.9504 బిల్లు వేశారు. దీంతో క్రాంతి కిరణ్ ఏడీఈ వినోద్ రెడ్డిని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టి అధికంగా వచ్చిన బిల్లును తొలగించాలని, వాడిన రీడింగ్ ఆధారంగా బిల్లు చెల్లిస్తానని కోరాడు. అయినా సిబ్బంది పట్టించుకోకుండా గురువారం అతడి ఇంటి కరెంట్ కనెక్షన్‌ను తొలగించారు. పూర్తి బిల్లు కడితేనే పునరుద్ధరిస్తామన్నారు. దీంతో ఆయన చేసేదేమి లేక డీఈ కార్యాలయం ఎదుట బైఠాయించి ల్యాప్ టాప్‌లో వర్క్ ఫ్రమ్ హోమ్ విధులను నిర్వహించాడు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ 'సాక్షి'తో మాట్లాడుతూ అధికంగా వచ్చిన బిల్లును సరి చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా.. కనెక్షన్ కట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు క్రాంతి కిరణ్‌కు సర్దిచెప్పేందుకు యత్నించారు. అయినా వినకపోవడంతో విద్యుత్ కనెక్షన్‌ను పునరుద్ధరించారు.



కరెంటు బిల్లు చూపుతున్న బాధితుడు

పని ఒత్తిడితో ఆలస్యం

బిల్లు అధికంగా వచ్చింది. 19న క్రాంతి కిరణ్ ఫిర్యాదు చేసినప్పటికీ పని ఒత్తిడి, సెలవుల కారణంగా సమస్య పరిష్కారం ఆలస్యమైంది. డీఈ కార్యాలయంలో ఇంటర్నెట్ సమస్య ఉన్నందున బిల్లు సరిచేయడం ఆలస్యమైంది. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం.

– వినోద్‌రెడ్డి, ఏడీఈ

ప్రకటన

సాధారణ ప్రజలందరికీ ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా శ్రీ మహ్మద్ అబ్దుల్ సమద్ తండ్రి స్వర్గీయ మహమ్మద్ యూసుఫ్, వయస్సు దాదాపు 30 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: ఇ.నం.8-2-115/ఎ, షైలారెడ్డిపల్లి, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ వారు అయిన మీరు నా క్లయింటు కొమ్మగంటి సుదర్శన్ గౌడ్ తండ్రి కె. అంజయ్య గౌడ్, వయస్సు 36 సంవత్సరాలు, వృత్తి: వ్యవసాయం, నివాసం: ఇ.నం.3-15, తొండుపల్లి గ్రామం, శంషాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా వారికి చెందిన రంగారెడ్డి జిల్లా, ఫరూఖ్‌నగర్ మండలం, గుండ్లవెల్లి గ్రామంలోని శివారు వద్దగల సర్వే నం.39/ఎలోని ఎ.00-09 గుంటల విస్తీర్ణం మరియు సర్వే నం.47/1/1/1లోని ఎ.00-09 గుంటల విస్తీర్ణం, మొత్తం ఎ.00-18 గుంటల విస్తీర్ణం గల వ్యవసాయ భూమిని కొనుగోలు చేయడానికి 17 మే 2023న నా క్లయింటును సంప్రదించారు మరియు మీ ఉద్దేశ్యాన్ని వ్యక్తం చేశారు. అగ్రిమెంట్‌లో శ్రీమతి రుక్మమ్మ తండ్రి ఎస్. నారాయణ అని పేర్కొనబడింది కాని ఆమె అగ్రిమెంట్‌పై సంతకం చేయలేదు. సదరు భూమి తూర్పు: రోడ్డు, పశ్చిమం: సర్వే నం.40లోని భూమి, ఉత్తరం: కృష్ణారెడ్డి భూమి మరియు దక్షిణం: లోట భూమి సరిహద్దులతో ఉంది మరియు నా క్లయింటు సదరు భూమిని మీకు విక్రయించేందుకు తన అంగీకారం కనబరిచారు. ఇందునిమిత్తం సదరు ఆఫర్‌ను మీరు అంగీకరించారు మరియు నా క్లయింటుతో 17/05/2023న అమ్మకం ఒప్పందం (ప్రైవేట్) కుదుర్చుకున్నారు మరియు అడ్వాన్స్ నిమిత్తం కొంత పాక్షిక మొత్తాన్ని చెల్లించారు మరియు మిగతా అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించడానికి సదరు అమ్మకం ఒప్పందం అమలు తేదీ నుండి (2) నెలల గడువు సమయాన్ని ఒప్పుకొని అంగీకరించారు.

తదుపరిగా నా క్లయింటు సదరు అమ్మకం ఒప్పందం వ్రాసుకున్న మొదటిరోజు నుండి సదరు విషయాన్ని మీతో ప్రస్తావించారని మరియు మిగతా అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించి సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మిమ్మల్ని ఎన్నోసార్లు అభ్యర్థించారని నా క్లయింటు తెలియజేశారు. కాని మిగతా అమ్మకం ప్రతిఫలం ఫండ్స్‌ను మీరు సర్దుబాటు చేయలేకపోయారు మరియు మీ కాంట్రాక్టులోని భాగాన్ని నిర్వర్తించడంలో విఫలమయ్యారని తెలియజేశారు.

ఈ పరిస్థితులలో నా క్లయింటు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా సదరు అమ్మకం ఒప్పందంలో పేర్కొన్న గడువు మీరిపోయినందున సదరు అమ్మకం ఒప్పందం తేది 17/05/2023 రద్దు చేయబడింది మరియు అమ్మకం ప్రతిఫలంలో భాగంగా చెల్లించిన అడ్వాన్స్ మొత్తం (జప్తుచేయబడింది) మరియు తదుపరిగా పైన తెలిపిన భూమిలో మీకు ఎలాంటి క్లెయిములు లేవని ఇందుమూలంగా నా క్లయింటు స్పష్టంగా తెలియజేస్తున్నారు.

సం/- ఎస్. రమేష్‌బాబు, M.COM, L.L.B
అడ్వకేట్ మరియు నోటరీ
నం.13-228/ఎ/7, ఆఫీసర్స్ కాలనీ,
షాద్‌నగర్-509216, రంగారెడ్డి జిల్లా. 9848456560

అదుపు తప్పిన కారు

ఒకరికి గాయాలు

మణికొండ: అతి వేగంతో ఓ కారు అదుపు తప్పి ఔటర్ సర్వీసు రోడ్డు నుంచి పక్కనే ఉన్న సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం గచ్చిబౌలి నుంచి నార్సింగి వైపు వెళుతున్న కారు మైహోం అవతార్ వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని నార్సింగి పోలీసులు తెలిపారు.



సైకిల్ ట్రాక్‌లోకి దూసుకెళ్లిన కారు

లేగదూడలపై కుక్కల దాడి

షాద్‌నగర్: లేగదూడలపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటన మండల పరిధిలోని కడియాలకుంట తండాలో గురువారం వెలుగు చూసింది. తండాకు చెందిన మేఘావత్ నరేందర్ పాడి పశువులు, లేగదూడల పై బుధవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన పలువురు రైతులకు సంబంధించిన మేకలపై సైతం కుక్కలు దాడి చేయడంతో జీవాలు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.



వీధి కుక్కల దాడిలో గాయపడిన లేగదూడ

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు గురుకుల విద్యార్థిని



మెడల్ చూపుతున్న హైమావతి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని హైమావతి ఎంపికైంది. గురువారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. ఐవీ రావు బాక్సింగ్ క్లబ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో 2023-24కు గాను అండర్-19 విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని హైమావతి బంగారు పతకం కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా హైమావతిని పశ్చిమ ప్రాంతీయ సమన్వాయాధికారి శారదావెంకటేశ్, స్పోర్ట్స్ స్పెషల్ ఆఫీసర్ రామ్‌లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటుదాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని త్వరలో జరగే లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థును భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటుదామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కేశంపేట రోడ్డులో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. 1885 డిసెంబర్ 28న పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. పార్టీకి 134 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీల సారథ్యంలో పార్టీ గ్రామ స్థాయిలోనూ బలంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ... నాడు బ్రిటీష్ దొరలను.. నేడు గడీల దొరలను కాంగ్రెస్ గడగడలాడించిందన్నారు. ప్రజలకు స్వేచ్ఛా యుతమైన జీవితాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, యాదయ్య యాదవ్, బాబర్‌ఖాన్, రఘు, ఇబ్రహీం, బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, అప్పి, అందె మోహన్, పురుషోత్తంరెడ్డి, శ్రీధర్, ముబారక్, రమాదేవి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ముగ్గురికి గాయాలు

శంషాబాద్ రూరల్: బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి మృతి చెందగా, అతని కుటుంబ సభ్యులకు గాయాలైన సంఘటన గురువారం మండల పరిధిలోని పాల్మాకుల శివారులో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొడంగల్ మండలం, నాగారం గ్రామానికి చెందిన గాండ్ల రాజు(38) భార్య సంధ్య, కుమార్తె కీర్తన, కుమారుడు కార్తీక్‌తో కలిసి బైక్‌పై ఇబ్రహీంపట్నం నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మార్గ మధ్యలో పాల్మాకుల శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వారిని చికిత్స కోసం శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలను స్కూల్‌కు పంపి..

- ఉరేసుకుని తల్లి ఆత్మహత్య

మణికొండ: అనారోగ్యంతో కొంతకాలం క్రితం భర్త చనిపోవటంతో ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్న మహిళ గురువారం పిల్లలను స్కూల్‌కు పంపి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హైదర్షాకోట్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో ఉంటున్న లక్ష్మి(27) భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె కుమారుడు మోహన్(5), కుమార్తె అవంతిక(7)లతో కలిసి అద్దె ఇంట్లో ఉంటోంది. గురువారం ఉదయం పిల్లలు స్కూల్‌కు వెళ్లగానే ఇంట్లో ఒంటరిగా ఉన్న లక్ష్మి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయంత్రం స్కూల్ నుంచి తిరిగి వచ్చిన పిల్లలు తల్లి ఉరికి వేలాడుతుండటాన్ని గుర్తించి, పక్కింటి వారిని తీసుకువచ్చి చూపించారు. దాంతో వారు నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని, లక్ష్మి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని పేర్కొన్నారు.

సొసైటీ సర్వసభ్య సమావేశం

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దౌనాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రైతులకు రూ.60 లక్షల దీర్ఘకాలిక రుణాలకు ఈ సమావేశంలో అనుమతులు తీసుకున్నారు. 28 మంది రైతులకు సొసైటీలో కొత్తగా సభ్యత్వం కల్పించారు. సన్న, చిన్నకారు రైతులకు రూ.5,35,000 రుణాలను పంపిణీ చేశారు. సొసైటీలో బంగారు రుణాలపై గ్రాముకు రూ.4,100 ఇవ్వాలని తీర్మాణం చేశారు.

అమ్మో...! ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్

- వివాదాల్లో ఖాకీలు
- కేసులను తప్పుదోవ పట్టిస్తున్న వైనం
- ఇద్దరు సీఐలు.. ముగ్గురు ఎస్సైల సస్పెన్షన్

శంషాబాద్: నిత్యం వీఐపీల సేవలకు పరిమితయ్యే ఆర్‌జీఐఏ పోలీసులు.. స్టేషన్‌కి వచ్చే కేసులను తప్పుదోవ పట్టించడంలతో వివాదాల్లో చిక్కుకుంటున్నారు. గత కొన్నేళ్లు పలు కేసుల్లో ఆర్‌జీఐఏ పోలీసులు వ్యవహరించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస్ తన అధికారాన్ని దుర్వినియోగం చేయడంతో పాటు కేసు విచారణ సమగ్రంగా చేపట్టనందుకు సస్పెండ్ చేసినట్లు సైబారాబాద్ సీపీ వెల్లడించారు.

గతంలో..

సీఎస్‌కే విల్లాలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుని చనిపోయిన ఘటనలో బాధితుల మొరను పట్టించుకోకుండా నిందితులకు అనుకూలంగా వ్యవహిరించినట్లు తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. అంతకుమందు ఔటర్ రహదారిపై అక్రమ రవాణా కేసులో లారీని తప్పించిన కేసులో నాలుగేళ్ల కిందట అప్పటి సీఐ సస్పెండ్ అయ్యారు. కేసుకు సంబంధించిన ఓ మహిళతో వ్యవహారంలో ఓ ఎస్సై, పాస్‌పోర్టుకు సంబంధించిన కేసులో మరో ఎస్సై కూడా సస్పెండ్ అయ్యారు. ఇటీవల హెచ్‌ఎండీఏ భూములకు సంబంధించిన వ్యవహారంలో కూడా ఖాకీలు కబ్జాదారులకు సహకరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

వారికే పెద్ద పీట

ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో ప్రజాప్రతినిధులు, సంపన్నుల ఫిర్యాదులకు మాత్రమే స్పందిస్తారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్ని రకాల సివిల్ తగాదాల్లో కూడా తలదూరుస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బందోబస్తులతో బీజీగా ఉండే ఇక్కడి పోలీసులు సాధారణ కేసులను సత్వరంగా.. సమగ్రంగా దర్యాప్తు చేయలేని పరిస్థితులు కూడా ఉన్నాయనే వాదనలు కూడా ఉన్నాయి. ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక పీఎస్‌ను గతంలో సర్కారు కేటాయించిన అది కార్యరూపం దాల్చలేదు. ఎయిర్‌పోర్టు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి, శంషాబాద్ పట్టణంతో కూడిన ప్రాంతానికి ప్రస్తుత పోలీస్ స్టేషన్ సేవలందించాల్సిన అవసరముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

కండల కోసం ఇంజెక్షన్.. మత్తు కోసం సిరప్!

- అక్రమంగా విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు
- ముగ్గురి అరెస్టు, భారీగా సరుకు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: వైద్య రంగంలో అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లను స్టెరాయిడ్స్‌గా, దగ్గు మందును మత్తు మందుగా విక్రయిస్తున్న ముఠా గుట్టును పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. కొందరు యువకులు తక్కువ కాలంలో కండలు పెంచడానికి ఈ ఇంజెక్షన్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ముఠాకు చెందిన ముగ్గురు నిందితులకు అరెస్టు చేశామని డీసీపీ బల్లవరకు శ్రీ బాల గురువారం ప్రకటించారు. వీరి నుంచి భారీగా ఇంజెక్షన్లు, సిరప్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కిషన్‌బాగ్‌కు చెందిన మహ్మద్ అఫ్సర్ అహ్మద్ ఖాన్ గతంలో స్మార్ట్ లైఫ్ ఫార్మసీ పేరుతో ఔషధ విక్రయ దుకాణం నిర్వహించారు. నష్టాలు రావడంతో దీన్ని మూసేసి ప్రస్తుతం హోటల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈయన గతంలో జిమ్‌లో ఎక్కువ సమయం గడపడానికి స్టెరాయిడ్‌గా టెర్మిన్ ఇంజెక్షన్, మత్తు కోసం దగ్గు మందు వాడేవాడు. తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం ప్రస్తుతం దీన్నే దందాగా మార్చుకున్నాడు. ఫార్మా వ్యాపారంలో ఉన్న పాత స్నేహితుల నుంచి ఒక్కో ఇంజెక్షన్ రూ.314కు ఖరీదు చేసి రూ.600కు, సిరప్ రూ.186కు కొని రూ.300కు విక్రయిస్తున్నాడు. ఈ దందాలో ఇతడికి బంజారాహిల్స్‌కు చెందిన పెయింటింగ్ కాంట్రాక్టర్ షేక్ దావూద్, ఫస్ట్ లాన్సర్‌కు చెందిన పెయింటర్ మహ్మద్ అంజాద్ సహకరిస్తున్నారు. వీరి దందాపై సమాచారం అందుకున్న పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా నేతృత్వంలోని బృందం వలపన్ని ముగ్గురినీ పట్టుకుంది. వీరి నుంచి 667 ఇంజెక్షన్లు, 65 సిరప్‌లు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం గుడిమల్కాపూర్ పోలీసులకు అప్పగించారు. ఇలాంటి ఇంజెక్షన్లు, టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్‌గా, దగ్గు మందును మత్తు కోసం వాడటం వల్ల అనేక దుష్పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వీటిని సుదీర్ఘకాలం వాడితే రక్తపోటు, గుండె సమస్యలతో పాటు మానసిక ఇబ్బందులు వస్తాయని స్పష్టం చేస్తున్నారు.



ఫార్ములా-ఈ ఉన్నట్లా.. లేనట్లా..

- ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదన్న నిర్వాహకులు
- ఒప్పందం మేరకు ఫిబ్రవరి 10న ఫార్ములా-ఈ పోటీలు
- మిగిలింది మరి కొన్ని వారాలే...

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ఫార్ములా-ఈ పోటీలపైన తాజాగా సందిగ్ధం నెలకొంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 10న ఈ పోటీలు జరగాల్సి ఉంది. ఈ మేరకు ఫార్ములా-ఈ నిర్వహణ కమిటీ గత ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఇప్పటి వరకు పోటీలపై ఎలాంటి పురోగతి లేకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఫార్ములా-ఈ పోటీలపైన ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో తాము ముందుకు వెళ్లలేకపోతున్నట్లు నిర్వహణ కమిటీ అభిప్రాయపడింది. మరోవైపు కొత్త ప్రభుత్వాన్ని కలిసి చర్చించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంది. ఫార్ములా-ఈ పోటీలకు ముందు జరగాల్సిన ఇండియన్ రేసింగ్ కార్ పోటీలకు అప్పట్లో హెచ్ఎండీఏ అధికారులు సన్నాహాలు చేపట్టారు. కానీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆ పోటీలను వాయిదా వేయడంతో నిర్వాహకులు వేదికను చెన్నైకు మార్చారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ ఏడాది అక్టోబర్ 30న ఫార్ములా-ఈ, ప్రభుత్వ మున్సిపల్‌శాఖల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఫిబ్రవరి 10న పోటీలను నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో సందిగ్ధత నెలకొందని నిర్వాహకులు పేర్కొన్నారు. దీంతో ఇటు ప్రభుత్వానికి, అటు భాగస్వామ్య సంస్థలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు అభిప్రాయపడింది. భారతదేశంలోనే ఫార్ములా-ఈ పోటీలకు ఈ ఏడాది ఆరంభంలో మొట్టమొదటిసారి హైదరాబాద్ వేదికగా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల కోసం హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులో అంతర్జాతీయ ప్రమాణాలతో 2.8 కిలోమీటర్ల మేర స్ట్రీట్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం అధికారులు దక్షిణకొరియాలోని సియోల్ సైతం పర్యటించి పోటీలపైన అధ్యయనం చేసి వచ్చారు. మహేంద్ర ఆటోమొబైల్స్‌తో పాటు జాగ్వార్, ఆడి, తదితర 11 ఆటోమొబైల్ సంస్థలకు చెందిన ఎలక్ట్రిక్ సింగిల్ సీటర్ కార్లు పోటీల్లో పాల్గొన్నాయి.

జాతీయ రహదారిపై యువకుడి వీరంగం

ఉప్పల్: కుటుంబ కలహాలు, వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై వీరంగం సృష్టించాడు. గాజు పెంకులు, బీరు సీసాలతో తనను తాను గాయపరచుకుంటూ బీభత్సం సృష్టించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ బిక్కనూరు ప్రాంతానికి చెందిన అన్వేష్(30) బైక్ మెకానిక్‌గా పని చేసేవాడు. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వచ్చిన అతను గత కొంతకాలంగా వ్యక్తి గత కారణాలు, కుటుంబ కలహాలతో సైకోలా ప్రవర్తిస్తున్నాడు. గురువారం ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి సబ్‌స్టేషన్ బస్టాప్ వద్ద బీరు సీసా పగులగొట్టి గాజు పెంకులతో శరీరాన్ని గాయపరుకున్నాడు. దీనిని చూసిన వారు భయంతో పరుగులు తీశారు.స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.